జొన్న పంట ధ్వంసం

వేమనపల్లి, జనవరి 16 : మండలంలోని జాజులపేట గ్రామ శివారులోని తన జొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయని రైతు చౌదరి తిరుపతి తెలిపారు. బుధవారం రాత్రి మూడు ఎకరాల్లోని పంటను ధ్వంసం చేశాయని, చేతికి అందిన పంట ధ్వంసం కావడంతో తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. వ్యవసాయాధికారులు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

బెల్లంపల్లి, జనవరి 16 : బెల్లంపల్లి మండలంలోని ఆకెనపల్లి శివారు సర్వేనం 64 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. గురువారం తహసీల్దార్ జ్యోత్స్న ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. నిర్మాణం చేపట్టే సబ్‌స్టేషన్ కోసం కూడా స్థలాన్ని గుర్తించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. రూరల్ సీఐ అప్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ బందోబస్తు నిర్వహించారు.

ఆరోపణలు సరికావు

మంచిర్యాల అర్బన్, జనవరి 16: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుపై ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ నేతలు అన్నారు. గురువారం జయరామారావుపై జరిగిన దాడి విషయంలో ఆరోపణలు చేయడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ రావు, కౌన్సిలర్ గాజుల ముఖేశ్ గౌడ్, మిట్టపల్లి లక్ష్మిపై డీసీపీ భాస్కర్‌కు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు ఫిర్యాదు చేశారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

ఎదులాపురం, జనవరి 16: ఆదిలాబాద్‌లోని భుక్తాపూర్‌కు చెందిన వాంఖడే సాయి రామ్(25) ఆటో డ్రైవర్ అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 15వ తేదీన ఉదయం 9.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయి రాలేదు. చుట్టూ పక్కల బంధువుల ఇండ్లలోకి వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య గౌరీ రీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దేశీదారు బాటిళ్లు స్వాధీనం

ఎదులాపురం, జనవరి 16 : ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మివాడకు చెందిన దినేశ్ వద్ద 140 దేశీదారు బాటిళ్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు తీసుకొచ్చి పట్టణంలో విక్రయించే క్రమంలో రైల్వే స్టేషన్ సమీపంలో దినేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఒకరిపై కేసు

సోన్, జనవరి 16 : నిర్మల్ పరిధిలోని విశ్వనాథ్‌పేట్ కాలనీ సమీపంలో గురువారం ఏఎస్ఐ దేవేందర్‌గౌడ్, సిబ్బంది రాజ్‌కుమార్, రమేశ్ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి కానిస్టేబుల్ రమేశ్‌ను ఢీ కొట్టడంతో గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింబాద్రి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కడెం, జనవరి 16 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మోర్రిగూడెం గ్రామానికి చెందిన సాదు రాజేందర్(42) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణాసాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..సాదు రాజేందర్(42) మద్యానికి బానిసై ఇంట్లో ఏమి పని చేయకుండా ఉండేవాడు. పని చేయకుంటే ఎలా బతికేది, అప్పులు ఎలా తీర్చేది అని అంటూ మద్యం తాగవద్దు భార్య చెప్పినందుకు మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది సాదు రాజేందర్ ఈ నెల 13వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్‌కు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతుండగా బుధవారం రాత్రి 11.30 గంటలకు మృతి చెందాడు. భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

లక్ష్మణచాంద, జనవరి 18: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం తిర్‌పల్లి గ్రామానికి చెందిన సిలారి ధర్మారం సురేశ్(22) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సుమలత తెలిపారు. ఎస్ఐ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిలారి ధర్మారం సురేశ్ ఐదు నెలల క్రితం దుబాయి నుంచి స్వదేశానికి తిరిగివచ్చాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసై పిచ్చిపిచ్చిగా ప్రవర్తించేవాడు. ఈ నెల 13వ తేదీన తన వ్యవసాయ భూమిలో పని చేయడానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని తల్లి ముత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమలత తెలిపారు.

ఆపరేషన్ స్మైల్ బృందం ఆకస్మిక తనిఖీలు

తనిఖీ చేస్తున్న అధికారులు

మంచిర్యాల అర్బన్, జనవరి 16: ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా గురువారం మంచిర్యాల పట్టణంలోని ఏ టూ జడ్ షాపింగ్ మాల్స్‌లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. 14 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ స్మైల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట, జనవరి 16 : కాసిపేట మండలంలోని కల్యాణిఖని ఓపెన్ కాస్ట్‌లో భూ సేకరణ విషయంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ బాకీ వెంకటయ్యను కలిసి కోరినట్లు లంబాడీ జేఏసీ అధ్యక్షుడు సపాట్ శంకర్ తెలిపారు. సర్వే నంబర్ 146, 147లో రైతులకు రావాల్సిన నష్ట పరిహారం విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చైర్మన్ వెంటనే కాసిపేట తహసీల్దార్‌కు ఫోన్‌లో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న రైతులకు రావాల్సిన నష్ట పరిహారం చెల్లించాలని చైర్మన్ మాట్లాడినట్లు సపాట్ శంకర్ తెలిపారు.

రిటైర్‌మెంట్ వయోపరిమితి పెంచొద్దు

నస్పూర్, జనవరి 16 : రాష్ట్రంలో మార్చి వరకు 7995 మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్‌మెంట్ అవుతున్న సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల విరమణ వయస్సు పెంపు నిర్ణయం తీసుకోవడం సరికాదని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. ఉద్యోగ విరమణ వయస్సు పెంచడం వల్ల నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం రిటైర్‌మెంట్ అయిన వారికి బెనిఫిట్స్ ఇచ్చే పరిస్థితుల్లో లేనందువల్లనే ఈ నిర్ణయం తీసుకుందని ఇది సరికాదన్నారు.

ముగిసిన ఎంపీఎల్-2 క్రికెట్ టోర్నమెంట్

విజేత జట్టుకు నగదు, ట్రోఫీ అందజేస్తున్న అంజనీపుత్ర సంస్థ చైర్మన్, ఎండీ,

నస్పూర్, జనవరి 16 : మంచిర్యాలలోని శివాజీ గ్రౌండ్‌లో పది రోజులుగా నిర్వహిస్తున్న ఎంపీఎల్ సీజన్ 2 క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతగా నిలిచిన జీటీ జట్టుకు అంజనిపుత అధినేత గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి చేతుల మీదుగా లక్ష రూపాయల నగదు, ట్రోఫీని అందజేయగా, రన్నర్‌గా నిలిచిన ఎస్ఆర్‌హెచ్ ఎన్‌టీఆర్ నగర్ జట్టుకు వసుధ హాస్పిటల్ సన్నీ పటేల్, కెల్విన్ హాస్పిటల్ కొమ్ముశ్రీనివాస్, ఉదారి చంద్రమోహన్ గౌడ్ చేతుల మీదుగా రూ. 50 వేల నగదు,ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో ఎంపీఎల్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సూరినేని కిషన్, సదానందం, క్రీడా కారులున్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

కబడ్డీ పోటీల విజేతలతో నిర్వాహకులు

కోటపల్లి, జనవరి 16: కోటపల్లి మండలంలోని పారుపల్లిలో రెండు రోజుల క్రితం ప్రారంభమై కబడ్డీ టోర్నమెంట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 38 టీంలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ టోర్నమెంట్‌లో మొదటి స్థానంలో వెంకట్రావ్‌పేట (భజరంగ్) జట్టు నిలువగా, ద్వితీయ స్థానంలో కాటారం జట్టు ప్రతిభ కనబర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి స్టడీ మెటీరియల్ అందజేత

కోటపల్లి, జనవరి 16: కోటపల్లి మండల కేంద్రంలోని గ్రంథాలయానికి మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్, వారి కుమారుడు రామ్ కౌశిక్ గ్రంథాలయానికి పలు రకాల స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. కీ.శే పురాణం కిష్టయ్య, కీ.శే పురాణం శ్యాం సుందర్ రావు స్మారకార్థం మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్ సొంత ఖర్చులతో గ్రంథాలయాన్ని నిర్మించారు. పోటీ పరీక్షల అభ్యర్థుల విన్నపం మేరకు 91 రకాల పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్, లైబ్రెరియన్ మురళి విద్యార్థులు పాల్గొన్నారు..

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మంచిర్యాల అర్బన్, జనవరి 16: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ అన్నారు. రోడ్డు భద్రతా మసోత్సవాల సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపవద్దన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. నియమనిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో పశువైద్య శిబిరం

మందులు అందజేస్తున్న ఉమ్మడి జిల్లా పశు గణాభివృద్ధి అధికారి రామారావు

జన్నారం, జనవరి 16 :మండలంలోని తిమ్మాపూర్‌లో మంచిర్యాల జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఈ శంకర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పశు గణాభివృద్ధి కార్యనిర్వాహక అధికారి డాక్టర్ రామారావు రాథోడ్ ఆధ్వర్యంలో 26 గేదెలు, 39 అవులకు ఉచిత గర్భకోశవ్యాధి నివారణ, పశువైద్య చికిత్స అందించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 19 దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలోమండల పశువైద్య అధికారి కస్తూరి శ్రీకాంత్ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, కార్యదర్శి లావణ్య, సిబ్బంది యాకుబ్‌అలీ, ఓఎస్ సంజీవ్, గోపాల మిత్ర రాజయ్య, రమేశ్, పాడి రైతులు పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు

నస్పూర్, జనవరి 16 : ఈ నెల 18న జిల్లాలో జరిగే నవోదయ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు లక్షెట్టిపేట, చెన్నూరు, మందమర్రి, బెల్లంపల్లిలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు 1383 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

రోడ్ల వెంట ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- తొలగించాలని వాహనదారుల వినతి

మందమర్రి ఆర్వోబీ, సింగరేణి గ్రీన్‌పార్క్ మూలమలుపు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

మందమర్రి, జనవరి 16: మందమర్రి పట్టణంలోని రహదారుల పక్కన, మూల మలుపుల వద్ద విచ్చల విడిగా ఏర్పాటు చేసిన వ్యాపార ప్రకటనలు, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. పట్టణంలోని నాలుగు వరుసల జాతీయ రహదారితో పాటు పాతబస్టాండ్ నుంచి పాలచెట్టు వైపు వెళ్లే కోల్‌బెల్ట్ రహదారికి ఇరువైపులా వ్యాపార ప్రకటనలు, దవాఖానాల ప్రచారాలతో పాటు పలు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. రహదారుల మూలమలుపులతో పాటు ఆర్వోబీ వంతెన వద్ద ఇరువైపులా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులతో పాటు ప్రభుత్వ స్థలాలను, పర్యాటక ప్రదేశాలను సైతం వదలకుండా కొందరు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించాల్సిన సంబంధిత మున్సిపల్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ప్రమాదాలు జరుగుతున్నా పోలీసు అధికారులు సైతం చర్యలు తీసుకోవడం లేదని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

ప్రమాదకరంగా మారిన ఫ్లెక్సీలను తొలగించాలని ఇటీవల స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైతం బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఊరు మందమర్రి ఊరు చెరువు మినీ ట్యాంక్‌బండ్ అందాలను సైతం కనిపించకుండా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని, రహదారులు, ప్రభుత్వ స్థలాల్లో ఫ్లెక్సీల ఏర్పాటుకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని బీఆర్ఎస్ నాయకులతో ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్లెక్సీలకు అనుమతి లేదు..

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని రహదారుల పక్కన విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు ఎలాంటి అనుమతులు లేవని మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు తెలిపారు. ఫ్లెక్సీల ఏర్పాటు పై వివరణ కోరగా తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. రహదారుల పక్కన విచ్చల విడిగా ఏర్పాటు చేసిన, ప్రమాదకారంగా ఉన్న ఫ్లెక్సీలను రెండు, మూడు రోజుల్లో తొలగిస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా మున్సిపల్ పరిధిలో ఎవరూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దన్నారు.

- మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు

నామమాత్రంగా ఈజీఎస్ ప్రజావేదిక

- రూ.16,166 రికవరీ, రూ.2000 జరిమానా

కాసిపేట : ఈజీఎస్ ప్రజావేదికలో నివేదికలను పరిశీలిస్తున్న డీఆర్డీవో, అధికారులు

కాసిపేట, జనవరి 16 : కాసిపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం మంచిర్యాల డీఆర్డీవో ఎస్ కిషన్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రూ.4.85 కోట్ల పనులకు సంబంధించి నివేదిక సమర్పించారు. ఈ తనిఖీలో సామాజిక తనిఖీ బృందం జరిగిన తప్పులను, లోపాలను వివరించారు. దీని ఆధారంగా డీఆర్డీవో ఎస్. కిషన్ జరిమానాలు, రికవరీలకు ఆదేశించారు.లంబాడీతండా(కే) పంచాయతీలో రూ.1000, పెద్దనపల్లి పంచాయతీలకు రూ.1000 జరిమానా విధించారు. సోమగూడెం(కే) పంచాయతీలో రూ.7305, పెద్దనపల్లిలో రూ.4262, కోనూర్‌లో రూ.621, రొట్టపల్లిలో రూ.541, లంబాడీతండా(డీ)లో రూ.1873, కోమటిచేనులో రూ.517, మల్కెపల్లిలో రూ.1047లను రికవరీకి ఆదేశించారు. మొత్తం రూ.2000 జరిమానాలు, రూ.16166 రికవరీలు చేయాలని అధికారులకు సూచించారు. సామాజిక తనిఖీ బృందం ఈజీఎస్ పనుల్లో చాలా తప్పులను, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేయగా అధికారులు వాటిని పెద్దగా పట్టించుకోలేదని విమర్శలు వచ్చాయి. నామమాత్రంగా ప్రజా వేదిక ముగించి స్వల్ప జరిమానాలు, రికవరీలకు ఆదేశాలివ్వడం పలు విమర్శలకు తావిస్తున్నది. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సాంబశివ రావు, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో శేఖ్ సఫ్దర్ అలీ, సామాజిక తనిఖీ బృందం ఎస్‌పీఎం వేణు, ఎస్ఆర్పీ రాంజీ, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్పీలు పాల్గొన్నారు.

బస్సులో ఎంపీ, ఎమ్మెల్యే కోటా సీట్లపై వివాదం

- చెన్నూర్‌లో గంట సేపు నిలిచి పోయిన బస్సు
- ఇబ్బంది పడ్డ ప్రయాణికులు

ప్రయాణికుల మధ్య గొడవతో గంట సేపు నిలిచి పోయిన ఆర్టీసీ లహరి బస్సు

చెన్నూర్, జనవరి 16: ఆర్టీసీ బస్సులో ఎంపీ, ఎమ్మెల్యే రిజర్వేషన్ కోటా సీట్ల విషయంలో ప్రయాణికుల మధ్య వివాదం తలెత్తడంతో చెన్నూర్ నుంచి హైదరాబాద్‌కు బుధవారం రాత్రి పదిన్నర గంటలకు బయలుదేరాల్సిన లహరి బస్సు గంట సేపు నిలిచిపోయింది. దీంతో అందులో ప్రయాణించే మిగతా ప్రయాణికులు ఇబ్బందులకు గురైయ్యారు. మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ అధికారులు ప్రతి రోజూ రాత్రి 10:30 గంటలకు చెన్నూర్ నుంచి హైదరాబాద్‌కు లహరి బస్సును నడుపుతున్నారు. సీట్ల కోసం రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఇందులో ఎంపీ, ఎమ్మెల్యే కోటా కింద రెండు సీట్లను కేటాయించారు. వీటిని ఎంపీ, ఎమ్మెల్యేకు సంబంధించిన లెటర్ ప్యాడ్‌లో సిఫారసు లేఖ తీసుకవచ్చిన వారికి ఈ సీట్లు కేటాయిస్తారు. రద్దీ అధికంగా ఉండడంతో ముందుగా వచ్చిన వారు ఎలాంటి సిఫారసు లేఖ లేకుండానే టికెట్లు తీసుకొని ఎంపీ, ఎమ్మెల్యేల కోటాకు సంబంధించిన సీట్లలో కూర్చున్నారు. ఆ తర్వాత ఎంపీ, ఎమ్మెల్యే సిఫారసు లేఖలతో వచ్చిన వారు, ముందుగా కూర్చున్న వారిని లేపేందుకు ప్రయత్నించగా వారు నిరాకరించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో బస్సు గంట సేపు నిలిచిపోయింది. రిజర్వేషన్లు చేసుకున్న మిగతా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్సు డ్రైవర్‌పై అసహనం వ్యక్తం చేశారు. చివరకు సీట్ల విషయంలో ప్రయాణికుల మధ్య రాజీ కుదరడంతో గంట ఆలస్యంగా రాత్రి 11:30గంటలకు బస్సు బయలు దేరింది.

లబ్ధిదారుల సర్వేను పారదర్శకంగా చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డేవిడ్
- పలు మండలాల్లో సర్వేను పరిశీలించిన అధికారులు

జైనూర్ : అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

వాంకిడి : సర్వే తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

జైనూర్ ,జనవరి 16: ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుభరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికపై చేపట్టిన సర్వేను పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. గురువారం మండలంలోని ఉషేగాంలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాల్లో అర్హులా ? కాదా ? అని పారదర్శకంగా పరిశీలించాలని అధికారులను కోరారు. పరిశీలన కార్యక్రమంపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ ఆడ బీర్‌షావ్, ఎంపీవో మోహన్, ఎంఈవో మధుకర్ జాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏవో ఆనంద్ రావ్, పంచాయతీ కార్యదర్శి మనోజ్ కుమార్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్ డేవిడ్

వాంకిడి,జనవరి16: సర్వే పారదర్శకంగా ఉండాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సర్వే తీరును ఆయన పరిశీలించారు. రేషన్ కార్డు, రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని సూచించారు. సర్వే కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రాథోడ్ భూక్యా, వాంకిడి తహసీల్దార్ రియాజ్ అలీ,ఎంపీవో ప్రవీణ్‌కుమార్, సర్వేయర్లు, గ్రామ కార్యదర్శి శివకుమార్ రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఖైర్‌గాం గ్రామంలో..

రెబ్బెన, జనవరి 16: రెబ్బెన మండలం ఖైర్‌గాం గ్రామంలో గురువారం సర్వే తీరును అదనపు కలెక్టర్ డేవిడ్ పరిశీలించారు. రైతు భరోసా కోసం గుట్టలు, రాళ్లు, రప్పలు, రోడ్లు, లే అవుట్లు, ప్లాట్లు, పరిశ్రమలు గుర్తించాలని, ఆత్మీయ భరోసా కోసం వ్యవసాయ కూలీలు, భూమి లేని వారిని గుర్తించాలని, 2023-2024 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 పనిదినాలు కూలీ పనులు చేసి ఉండాలని, కుటుంబంలో ఒకరికి వర్తిస్తుందన్నారు. ఈ నెల 19వ తేదీలోపు సర్వేలు పూర్తి చేసి నివేదికలు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీవో భిక్షపతి, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఏవో దీలీప్‌తో పాటు ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యు సిబ్బంది ఉన్నారు.

చెన్నూర్ రూరల్ : సర్వేను పరిశీలిస్తున డీపీవో వెంకటేశ్వర్లు

చెన్నూర్ మండలంలో డీపీవో పరిశీలన

చెన్నూర్ రూరల్, జనవరి 16: చెన్నూర్ మండలంలోని అంగ్రాజ్‌పల్లి, చెల్లాయిపేట, దుగ్నెపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) సర్వేను మంచిర్యాల డీపీవో (మండల ప్రత్యేక అధికారి) వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, పంచాయతీ కార్యదర్శులు రాజేందర్, యూసప్, స్వరూప పాల్గొన్నారు.

భీమారం, జనవరి 16: భీమారం మండలంలో ఆరెపల్లి 36 మందికి, భీమారం 182 మందికి, బూర్గుపల్లి 18, దాంపూర్ 14, దర్మారం 16, ఎల్కేశ్వరం 14 కాజీపల్లి 31, కొత్తపల్లి 23, మద్దికల్ 32, నర్సింగాపూర్ 17, పోలంపల్లి 27 మంది రేషన్ కార్డుల లబ్ధిదారుల పేర్లు రాగా ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులతో పాటు మండల ప్రత్యేక అధికారి కల్పన, ఎంపీడీవో మధుసూదన్, రెవెన్యూ అధికారులు తహసీల్దార్ సదానందం, ఆర్ఐ స్రవంతి ఇంటింటికి వెళ్లి తనిఖీ చేశారు. భీమారం 182 మంది లబ్ధిదారుల లబ్ధిదారులు పేర్లు ఉండగా అందులో 10 మందికి పైగా సింగరేణి రిటైర్డ్ కార్మికులతో పాటు మాజీ సర్పంచ్ గద్దెరాంరెడ్డి పేరు కూడా ఉండడం విశేషం. కొందరు అర్హుల పేర్లు లేక పోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొన్నది.

కాగజ్‌నగర్‌లో శ్రద్ధాశుక్లా పరిశీలన

కాగజ్‌నగర్ రూరల్, జనవరి 16: కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లిలో జరుగుతున్నటు ఇంటింటి సర్వేను కాగజ్‌నగర్ అదనపు కలెక్టర్ శ్రద్ధాశుక్లా తనిఖీ చేశారు. సర్వేలో పొరపాట్లు లేకుండా, త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐలు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 16: ఉద్యోగోన్నతి పొందిన ఏఎస్ఐల బాధ్యత పెరిగిందని, బాధ్యతతో విధులు నిర్వహించాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏఎస్ఐ నుంచి ఎస్ఐలుగా ఉద్యోగోన్